నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

పోచారం: నారపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టినందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చౌదరిగూడ, మక్త, కొర్రెముల, వెంకటాపూర్ గ్రామాలకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నారపల్లి వీకర్ సెక్షన్ కాలనీ, రేవతి రైస్‌మిల్, సప్తగిరి కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగావకాశాలు

మేడ్చల్: ఈఎంఆర్ఐలో పని చేసేందుకు పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా ప్రోగ్రాం అధికారి సేక్ జాన్ షామిద్ తెలిపారు. సంస్థలో ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌లుగా పని చేసేందుకు బీటెక్ అర్హత ఉన్న యువకులు 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 25వ తేదీ వరకు దేవరయాంజాల్ పరిధిలోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి గల యువత recuritment@emri.com మెయిల్‌కు తమ బయోడేటాను పంపాలని కోరారు.

పల్లె దవాఖానా ప్రారంభం



శామీర్‌పేట్: ప్రభుత్వ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలని మూడుచింతలపల్లి మండల ఎంపీపీ హారిక అన్నారు. సోమవారం మండల పరిధిలోని జగ్గంగూడ గ్రామంలో పల్లె దవాఖానాను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ర నాయకులను కలిసిన కాంగ్రెస్ నేత వజ్రేష్‌యాదవ్



మేడ్చల్: ప్రభుత్వ ప్రొటోకాల్ ప్రజా సంబంధాలు సలహాదారులుగా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వేణుగోపాల్‌ను, పీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షిని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ కలిశారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ తన అనుచరులతో కలిసి వారి నివాసాలకు వెళ్లి బొకె అందజేసి సన్మానించారు.

బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలి


మాట్లాడుతున్న జిల్లా మహిళా సాధికారత బృందం సభ్యులు

జవహర్‌నగర్: జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మహిళ సాధికారత బృంద సభ్యులు సోమవారం జవహర్‌నగర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మహిళా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత బృందం సభ్యులు మాట్లాడుతూ.. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టి బాలలకు బంగారు భవిష్యత్ ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల చట్టం, బాలకార్మిక చట్టంపై హెల్ప్‌లైన్ నంబర్స్– 181, 1098, 14567లలో సంప్రదించాలన్నారు. అనంతరం బాలల రక్షణ, బాల లింగ నిష్పత్తి, సఖీ సర్వీసెస్, పోక్సో యాక్ట్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సభ్యులు వాసవి, సవిత, స్థానిక మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

బఫర్‌లో అక్రమ నిర్మాణాలు


నాదెం చెరువు కట్టవద్ద బఫర్‌లో సాగుతున్న పనులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ నాదెం చెరువు బఫర్ జోన్‌లో వారం రోజులుగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారుల్లో చలనం రావడం లేదు. నీటి నిల్వ ప్రదేశానికి 100 మీటర్ల వరకు బఫర్‌లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధన ఉన్నా అక్రమార్కులు పట్టించుకోడవం లేదు. చెరువులో పట్టా భూమి ఉందంటూ ఇటీవల కాలంలో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. చెరువులకు ఎఫ్‌టీఎల్ (సరిహద్దులు) ఏర్పాటులో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అలసత్వం చూపడంతోనే అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. తాజాగా వెంకటాపూర్ నాదెం చెరువు కట్ట వద్ద మట్టి నింపేందుకు గోడ నిర్మిస్తున్నారు. అందులో మట్టిని నింపి భవనం నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిర్మాణాలు కొనసాగుతుండగా పనులు ఆపే బదులు మొదట్లోనే పనులు ఆపించాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

నేడు జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం

సాక్షి, మేడ్చల్ జిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రథమంగా మేడ్చల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగే మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆరు గ్యారంటీలపై వాడీవేడి చర్చ జరగనుంది. అలాగే, అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి చేరడంతో.. విపక్షంగా ఉన్న బీఆర్ఎస్ సభ్యులు ఆరు గ్యారంటీల దరఖాస్తుల ప్రగతి.. అమలుపై కూడా సమావేశంలో ప్రస్తావించేందుకు సన్నద్ధమవుతున్నారు.

మనసంతా.. రామ్‌లల్లా..



అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మేడ్చల్ జిల్లా శ్రీరాముడి నామస్మరణతో మార్మోగింది. 500 సంవత్సరాల హిందువుల కల నెరవేరడంతో అన్ని ప్రాంతాల్లోని ఆలయాల్లో పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరాముడి అక్షింతలను తలపై చల్లుకున్నారు. పలు ప్రాంతాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించి పెద్దఎత్తున అన్నదానాలు నిర్వహించారు. శోభాయాత్రలు ఉత్సాహంగా కొనసాగాయి. కాలనీల్లో కాషాయ జెండాలను ఏర్పాటు చేశారు. దీంతో అంతటా కాషాయమయం అయ్యింది. సాయంత్రం మహిళలు ఇళ్ల ముందు దీపాలను వెలిగించారు.

– మేడ్చల్ జోన్ బృందం


మేడ్చల్‌లో శోభాయాత్ర


గౌడవెల్లిలో హోమం


రాములోరి కల్యాణం


కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి సన్నిధిలోని రామాలయంలో పూజలు


నాగారంలో పూజల్లో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు


అహ్మద్‌గూడ దేవాలయంలో పూజలు


కీసరలో ఆకట్టుకున్న సెరినిటీ పాఠశాల విద్యార్థులు


పొన్నాల్‌లో వీరాంజనేయ స్వామి ఆలయంలో..


అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠను వీక్షిస్తున్న భక్తులు


గుండ్లపోచంపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి


ఘట్‌కేసర్ బస్సు ప్రయాణ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ఆంజనేయుడి విగ్రహం


ఘట్‌కేసర్‌లో స్వామివారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, చైర్ పర్సన్ పావనీజయ్య, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


అన్నోజిగూడలో సీతారాముల విగ్రహాల ఊరేగింపులో చైర్మన్ కొండల్‌రెడ్డి


అయ్యప్ప ఆలయంలో జ్యోతులు


రాజబొల్లారంలో శోభాయాత్రలో


పూడూర్ గ్రామంలో ప్రత్యేక పూజల అనంతరం సీతారాములు


ఘట్‌కేసర్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్, చైర్ పర్సన్, మాజీ ఎమ్మెల్యే


రాముడి జెండా, దీపాలతో చిన్నారులు

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీలను పరిష్కరించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలోని ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియలతో కలిసి ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసాలకోర్చి వస్తుంటారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలు, దరఖాస్తులు, ఫిర్యాదులను అవసరమైతే వెంటనే పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రస్థాయి నుంచి వచ్చే ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇస్తూ.. వాటిని పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజావాణిలో ప్రజల వద్ద నుంచి 77 ఫిర్యాదులు కలెక్టర్‌తో సహా సంబంధిత అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం


దీపాదేవి (ఫైల్)

జవహర్‌నగర్: యువతి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడలోని ఎల్ఎస్ఆర్ కాలనీలో భియారామ్ స్థానికంగా కిరాణాషాప్ నిర్వహిస్తూ, భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడితో నివసిస్తున్నారు. భియారామ్ రెండవ కుమార్తె దీపాదేవి(20). ఈ నెల 21న ఒక వ్యక్తి వద్ద డబ్బులు తీసుకురావాలని కుమార్తె దీపాదేవిని పంపాడు. ఈ క్రమంలో ఆమె ఇంటికి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో బాలిక అదృశ్యం


నవదీప (ఫైల్)

బాలాజీనగర్‌లో నివసించే నర్సింగ్‌రావు, లక్ష్మీలకు మనస్పర్థల కారణంగా పిల్లలతో కలిసి విడిగా నివాసం ఉంటున్నారు. వీరి కుమార్తె నవదీప(15) స్థానికంగా 9వ తరగతి చదువుతోంది. నవదీప తరచూ ఫోన్ చూస్తుండటంతో తల్లి మందలించింది. ఈ నెల 22న పాఠశాలకు కూడా వెళ్లలేదు. స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేవైఎం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజుగౌడ్ మృతి


రాజుగౌడ్ (ఫైల్)

జవహర్‌నగర్: బీజేవైఎం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ సీహెచ్.రాజుగౌడ్(29) మృతిచెందారు. బాలాజీనగర్‌లోని హనుమాన్ ఆలయంలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లకు హాజరై మాట్లాడుతుండగా ఒక్కసారిగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అవ్వడంతో అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

తగ్గేదేలె..

- బాపట్లకు చేరిన జవహర్‌నగర్ రాజకీయాలు
- బెదిరింపులకు భయపడేదిలేదు..
- మేయర్ పీఠంపై ఇద్దరి గురి


బాపట్లలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు

జవహర్‌నగర్: అవిశ్వాసంపై తగ్గేదిలేదని, మేయర్ ఎన్ని కుట్రలు పన్నినా అవిశ్వాసంపై పట్టు సాధిస్తామని బాపట్లకు వెళ్లిన అసమ్మతి కార్పొరేటర్లు చెబుతున్నారు. జవహర్‌నగర్ పాలకవర్గానికి ఈ నెల 27కు నాలుగేళ్ల పూర్తి కావస్తుండంతో మేయర్ కావ్యపై అవిశ్వాసం పెట్టేందుకు 18 మంది కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మాన పత్రంపై సంతకాలు చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేసి అనంతరం డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో సహా 18 మంది అసమ్మతి కార్పొరేటర్లు బాపట్లకు చేరారు. అవిశ్వాసం గట్టెక్కేందుకు మేయర్ వర్గం ఎన్ని ప్రలోభాలు పెట్టినా, బెదిరింపులకు పాల్పడినా భయపడేదిలేదని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

చక్రం తిప్పనున్న కాంగ్రెస్..

మేయర్ మేకల కావ్యపై అవిశ్వాసం పెట్టిన కార్పొరేటర్లు బాపట్లలో క్యాంపు రాజకీయం చేస్తుండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ తన కూతురు 28వ డివిజన్ నిహారికగౌడ్‌ను మేయర్‌ను చేసేందుకు విశ్వప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కాగా 18వ డివిజన్ కార్పొరేటర్ శాంతికోటేష్‌గౌడ్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో సహా 18 మంది అసమ్మతి కార్పొరేటర్లను తీసుకెళ్లడంతో రాజకీయం రసవత్తరంగా తయారైంది. మేయర్ పీఠంపై ఇద్దరు గురి పెట్టగా అసమ్మతి కార్పొరేటర్లు ఎవరి వైపు మొగ్గు చూపుతారో వేచి చూడాల్సి ఉంది.

ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని వసతులు

- ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ప్రాక్టికల్స్
- ఇంటర్ విద్యార్థుల సంఖ్య 1.31 లక్షలు
- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు సంబంధించి అన్నీ వసతులు సమకూర్చడంతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. ఇప్పటి నుంచే ఇంటర్ పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. ఇంటర్‌లో జనరల్, ప్రాక్టికల్స్, ఒకేషనల్ కోర్సులకు పరీక్షలు ఉంటాయన్నారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

తండ్రీ కొడుకుల మధ్య ఘర్షణ

- బయటకొచ్చిన గన్ వ్యవహారం
- తండ్రిని కాల్చేందుకు యత్నం
- తండ్రీకొడుకులకు రిమాండ్

అల్వాల్: తండ్రీకొడుకుల మధ్య జరిగిన ఘర్షణతో ఓ గన్ బయటపడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌లో నివసించే టోనీ థామస్ ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి. సెక్యూరిటీ ఉద్యోగం చేసుకోవడానికి థామస్ లైసెన్స్ డబుల్ బ్యారల్ టువల్ బోర్ గన్‌ను తీసుకున్నాడు. గన్ రెన్యూవల్ గడువు 2014లో ముగియగా అప్పటి నుంచి దాన్ని ప్రభుత్వానికి సరెండర్ చేయకుండా ఇంటి వద్దే ఉంచుకున్నాడు. థామస్ కుమారుడు జోమ్(30) డ్రగ్స్‌కు అలవాటుపడి ఇంట్లో నిత్యం గొడవలు చేసేవాడు. దీంతో కుటుంబసభ్యులు జోమ్‌ను రెండు నెలల క్రితం రిహాబిలిటేషన్‌లో చేర్పించారు. రెండు రోజుల క్రితం అతడు బయటకు వచ్చి ఆదివారం రాత్రి తండ్రితో తీవ్ర ఘర్షణకు దిగాడు. మత్తులో ఉన్న జోమ్ ఇంట్లో ఉన్న గన్ తీసి తండ్రి థామస్‌పై కాల్చే ప్రయత్నం చేశాడు. దీంతో వెంటనే థామస్ భార్య 100కు ఫోన్ చేయడంతో పోలీసులు థామస్ ఇంటికి వచ్చి తండ్రీ కొడుకులను అరెస్ట్ చేశారు. గన్‌ను రెన్యూవల్ చేయకుండా అక్రమ ఆయుధం కలిగి ఉన్నందున థామస్‌ను, తండ్రిపై దాడి చేసినందుకు కొడుకు జోమ్‌ను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.